క్లుప్తంగా

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

కొందుర్గు: కొత్తగా భూములు కొనుగోలు చేసి జూన్ 16వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులందరు రైతుబంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ కృష్ణవేణి సూచించారు. ఇందుకోసం భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ ఖాతా పుస్తకం దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. ఇదివరకు రైతుబంధు అందుతున్న రైతులు ఎవరైన తమ బ్యాంక్ ఖాతాలను మార్చుకోవాలనుకుంటే సదరు ఖాతా పుస్తకం జిరాక్స్‌లను అందజేయాలని సూచించారు.

నేడు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం

కేశంపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించేందుకు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఎంపీపీ రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు బుధవారం ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ అనుమతితో ఇతర అంశాలను చర్చించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమానికి మండల అధికారులు ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

టీపీసీసీ స్పోక్స్ పర్సన్‌గా గౌరీసతీష్



మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్‌గా నక్కలపల్లి గౌరీసతీష్ నియమితులైయ్యారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయనను స్పోక్స్ పర్సన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉరకలు వేస్తుందని విమర్శించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేసేందుకు నాయకులంతా కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. స్పోక్స్ పర్సన్‌గా నియమించిన కాంగ్రెస్ పార్టీ నాయకులందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అనుమతులేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీచైతన్య పాఠశాల అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తుందని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా నడుపుతున్నాయని చెప్పారు. చేవెళ్లలోని శ్రీచైతన్య, వివేకానంద పాఠశాలలు అనుమతులు పొందకుండా అడ్మిషన్లు చేసుకుంటూ తరగతులు కొనసాగిస్తున్నారని చెప్పారు. దీనిపై ఎంఈఓకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.. ప్రాసెసింగ్‌లో ఉన్నాయని సమాధానం చెబుతున్నారన్నారు. విద్యాధికారులే ప్రైవేట్ పాఠశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తే పిల్లల భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించారు. అనంతరం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, శ్రీనివాస్, సాయిగణేశ్, శ్రీకాంత్, శివ, రవికుమార్, వినోద్, విఘ్నేశ్‌పాల్గొన్నారు.

క్రీడలతో మేధోశక్తి

యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మధు



బహుమతులు అందజేస్తున్న మధు

షాద్‌నగర్‌రూరల్: క్రీడల సాధనతో మేధోశక్తి పెంపొందుతుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో 3వ రోజు కొనసాగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మధు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో మసులుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన టీంకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుధీర్, ఎన్‌ఎస్‌యూఐ అసెంబ్లీ అధ్యక్షుడు జీజోజాన్సన్, యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, వంశీగౌడ్, ప్రవీణ్, మధు, మహేష్‌గౌడ్, నాగరాజు, సంపత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



శివలింగానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



చేవెళ్ల: షెడ్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే తదితరులు

షాద్‌నగర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రామేశ్వరం ఆలయంలో, పట్టణంలోని ఎంబీ చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో ఆధ్యాత్మికత రోజు రోజుకూ పెంపొందుతుందన్నారు. భక్తిభావం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక మారుమూల గ్రామాల్లో ఉన్న దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. ధూ ప దీప నైవేద్య పథకం కింద దేవాలయాల్లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిధులతో పాటుగా, దాతల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగులకు ప్రభుత్వం పేదలకు ఉచితంగా దుస్తులను పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నరేందర్, నట్‌రాజన్, శంకర్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కల్గుతోందని ఎంపీడీఓ ఆంజనేయులు పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతిరోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, దేవాలయ కమిటీ చైర్మన్ గోపాల్, రాజేశ్వరస్వామి, యాదయ్య, జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేశంపేటలో ...

కేశంపేట: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని స్త్రీ,శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని పాటిగడ్డలోని చర్చి, పాపిరెడ్డిగూడ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విశాల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా నిధులు కేటాయించి సహకరిస్తుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ధన్‌రాజ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక ఉత్సవం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని జనవాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లలిత. శ్రీనివాస్, ఎంపీఓ గీత, ఎంఆర్‌ఐ తేజ పాల్గొన్నారు.

దూప దీప నైవేద్యాలు జరిగేలా కృషి

చేవెళ్ల: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తోందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఎండోమెంట్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని పల్లకీ సేవలో ఊరేగించారు. సీఎం కేసీఆర్ ఆధ్మాత్మికతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని చెప్పారు. యాదాద్రిని అద్భుతంగా నిర్మించి, ప్రాచీన దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దేవాలయాల్లో దూప దీప నైవేద్యాలు జరిగేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

విశ్రాంతి షెడ్ నిర్మాణానికి భూమి పూజ..

చేవెళ్లలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తుల విశ్రాంతికి షెడ్ నిర్మాణానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు భూమి పూజ చేశారు. రూ.22.20 లక్షల నిధులతో షెడ్‌ను నిర్మించనున్నట్లు దాతలు జెడ్పీటీసీ మర్పల్లి మాలతికృష్ణారెడ్డి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం దాత మాలతికృష్ణారెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి. శైలజ, ఎంపీపీ. ఎం.విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, ఎండోమెంట్ ఈఓ శ్రీనివాస్, పూజారులు వామనాచార్యులు, శ్రీకాంత్, శ్రీపాద, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే, తదితరులు

చేవెళ్ల: మన ఊరు– మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని కందవాడ జిల్లాపరిషత్, ప్రాథమిక పాఠశాలలో బుధవారం నూతనంగా రూ. 56.86లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల భవనం, విద్యార్థులకు డైనింగ్‌షెడ్, మరుగుదొడ్లు తదితర వాటిని ఎమెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఊరు– మనబడిలో భాగంగా 26వేల పాఠశాలల్లో 7200 కోట్ల నిధులతో పాఠశాలల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం కోసం ఉదయం పూట ఇచ్చే రాగిజావాలో ప్రోటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో కందవాడ సర్పంచ్ అరుందతిసాయిరెడ్డి, ఎంపీటీసీ కావలి రవీందర్, ఉప సర్పంచ్ కావ్యక్రిష్ణాగౌడ్, డీఈఓ సుశీరందర్‌రావు, ఎంపీపీ విజయలక్ష్మి జెడ్పీటీసీ మాలతి, ఎంఈఓ అక్బర్, వైస్ ఎంపీపీ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్



జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. జయశంకర్ వర్ధంతిని బుధవారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంగారు తెలంగాణకు బాటలు చూపిన మహాత్ముడి స్ఫూర్తి చెదరకుండా ప్రజలు తమ గుండెల నిండ పదిలంగా ఉంచుకున్నారని చెప్పారు. రాష్ట్ర సాధన కోసం పోరుబాట చూపిన సిద్ధాంతకర్త జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. నివాళి అర్పించిన వారిలో రాజావరప్రసాద్, ఈట గణేశ్, నరేందర్, ఎంఎస్ నట్‌రాజన్, ఒగ్గుకిషోర్, వెంకట్‌రాంరెడ్డి, నారాయణ, రవి యాదవ్, లక్ష్మణ్‌నాయక్, రాజ్యలక్ష్మి, శంకర్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, ప్రభాకర్, గంగిరెడ్డి, శరత్‌కృష్ణ, రాఘవేందర్, కమిషనర్ వెంకన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా

కొత్తూరు: సీఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారు పెంటమ్మకు ఆయన బుధవారం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.13 వేల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే వారికి ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా సహాయం అందిస్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది మందికి ఈ పథకం ద్వారా ఆర్థికంగా సహాయం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, భీమయ్య, లింగంనాయక్, శ్రీరాములుయాదవ్, మెండెకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నమో ఆరోగ్యమస్తుతో లబ్ధి

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదలకు ఉచిత వైద్య సేవలందించేందుకే నమో ఆరోగ్యమస్తును రూపకల్పన చేశామని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ , బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం, రాయికల్, విఠ్యాల, కంసాన్‌పల్లి, భీమారంలో నమో ఆరోగ్యమస్తు ద్వారా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమో ఆరోగ్యమస్తు ద్వారా నియోజకవర్గంలో 30 రోజుల వరకు ఉచిత వైద్య సేవలను అందించడం జరుగుతుందన్నారు. వైద్య సేవలను అందించడంతో పాటుగా మందుల పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మోహన్‌సింగ్, నర్సింహ్మాయాదవ్, ప్రదీప్, శ్యాంసుందర్ రెడ్డి, సుభాష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రశాంత్, రమేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, రాఘవేందర్, నర్సింహ్మ, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

పార్టీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి



నియామక పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కంసాన్‌పల్లిలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీకి కార్యకర్తలు పునాదుల్లాంటి వారని అన్నారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చింతకింది మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డె సత్తయ్య, ఉపాధ్యక్షుడిగా ఎండీ సాక్రబ్, హన్మంత్‌రెడ్డి, చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా ఖాసీం, సహాయ కార్యదర్శిగా నక్కపల్లి చెన్నయ్య, నర్సింలు, కోశాధికారిగా చింతకింది చెన్నయ్య, సభ్యులుగా గొడుగు నర్సింలును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దర్శన్, అబ్దుల్ వాహబ్, వెంకటయ్య, శేఖర్, మన్వర్, సత్తిరెడ్డి, సోమ్లానాయక్, రవి, సురేశ్, చెన్నయ్య, బాలరాజు, నర్సింలు, రమేశ్, నర్సింలు, రమేశ్, ఎండీపాషా, రాజు, రహీం, నర్సింలు పాల్గొన్నారు.

జోరుగా జీపీ నిర్మాణ పనులు



మొయినాబాద్‌రూరల్: మండలంలోని అజీజ్‌నగర్‌లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని గ్రామ సర్పంచ్ సంధ్య శ్రీశైలం అన్నారు. బుధవారం ఆమె భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవన పనులు చురుకుగా కొనసాగుతున్నాయని చెప్పారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ వారు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం,రాజ్‌గోపాల్,కార్మికులు తదితరులున్నారు.

పదేళ్లైనా పట్టించుకోరా?



చిలుకూరులోని రాజీవ్ గృహకల్ప గృహాలు

- చిలుకూరు రాజీవ్ గృహకల్పలో సమస్యల గోడు
- అందని మిషన్ భగీరథ నీళ్లు... బోర్ల ద్వారానే నీటి సరఫరా
- ప్రారంభించి పదేళ్లైనా గ్రామ పంచాయతీకి అప్పగించని హెచ్‌ఎండీఏ
- నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు పంచాయతీపై అదనపు భారం

మొయినాబాద్: పేదల కలల గూడులో సమస్యల గోడు వినిపిస్తుంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీళ్ల ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మాత్రం నీళ్ల అందడంలేదు. నీటి సమస్యతో పాటు డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గృహాలు ప్రారంభమై పదేళ్లు దాటినా ఇప్పటికీ వాటిని హెచ్‌ఎండీఏ నుంచి గ్రామ పంచాయతీకి అప్పగించలేదు. 2006లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం(జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) పథకం కింద 992 రాజీవ్‌గృహ కల్ప ఇళ్లను మంజూరు చేశారు. అందుకోసం రూ.35 కోట్ల నిధులు కేటాయించారు. 2008లో పనులు ప్రారంభమై 2012లో పూర్తయ్యాయి. 2013 జనవరిలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హోంమంత్రి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు.

బోర్ల ద్వారానే నీటి సరఫరా...

రాష్ట్ర వచ్చాక ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీళ్ల అందిస్తోంది. కానీ చిలుకూరులోని రాజీవ్‌గృహకల్ప గృహాలకు మాత్రం మిషన్ భగీరథ నీళ్ల అందడం లేదు. దీనికి ప్రధాన కారణం ఈ గృహాలు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో నమోదు కాకపోవడమే. ప్రస్తుతం ఇక్కడ బోర్ల ద్వారానే నీటిసరఫరా చేస్తున్నారు.

గ్రామ పంచాయతీపైనే భారం...

గ్రామ పంచాయతీలో నమోదై లేకున్నా ఇక్కడి సమ స్యల పరిష్కార భారం మాత్రం గ్రామ పంచాయతీపైనే పడుతుంది. బోర్ల ద్వారా నీటిసరఫరాతో పా టు పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల నిర్వహణ వంటి పనులన్నీ గ్రామ పంచాయతీ ద్వారానే చేయిస్తున్నారు. ఇక్కడ నిర్మించిన సెప్టిక్ ట్యాంక్‌లు ప్రతి ఆరు నెలలకోసారి నిండుతుండడంతో వాటిని పంచాయతీ ద్వారానే ఖాళీ చేయిస్తున్నారు. ఈ ఖర్చులన్నీ గ్రామ పంచాయతీ భరించాల్సి వస్తుంది.

భారం పెరుగుతుంది



చిలుకూరు రెవెన్యూలో పదేళ్ల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప గృహాలను హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటి వరకు గ్రామ పంచాయతీకి అప్పగించలేదు. దీంతో అక్కడ గ్రామ పంచాయతీ నుంచి పన్నులు వసూలు చేసే పరిస్థితి లేదు. కానీ, అక్కడి సమస్యలన్నీ గ్రామ పంచాయతీ పరిష్కరించాల్సి వస్తుంది. ఏడాదికి సుమారు రూ.10 లక్షలకుపైగా ఖర్చు అవుతుంది. ఈ భారమంతా గ్రామ పంచాయతీపై పడుతుంది.

– గుసుగుర్తి స్వరూప, సర్పంచ్, చిలుకూరు

గ్రామాభివృద్ధికి సహకరించండి

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ

మొయినాబాద్‌రూరల్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు, గ్రామ సర్పంచ్ శోభ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు రూ.7 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు, జిల్లా పరిషత్ ప్రహరీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామాభివృద్ధికి అందరు సహకరించినప్పుడే అభివృద్ధి వేగంగా జరుగుతోందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి సీఎం అధిక నిధులు ఇచ్చి సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్ధయ్య, పంచాయతీ కార్యదర్శి తారా బాయి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పనికిరాని సదస్సులు ఎందుకు?



అవగాహన సదస్సులో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వని అధికారులు తమ గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని ముట్పూర్‌లో బుధవారం కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జనుములు ఇవ్వలేదని, సీజన్‌లో సరిపడ యూరియా అందించడం లేదని ఆరోపించారు. తమకు సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు ఇవ్వకుండా వట్టి మాటలు చెప్పడానికి సభలు, సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సీఈఓ మహిమూద్ షరీఫ్ మాట్లాడుతూ..ఈ ఏడాది మండలానికి 50 బస్తాల జనుములు మాత్రమే వచ్చాయని వ్యవసాయాధికారులు ఇండెంట్ ఇచ్చిన రైతులకు అందించామన్నారు. ఆందోళన చేసిన వారిలో రైతులు ద్వివేందర్, అంజయ్య, బుయ్యని నర్సింలు, కనకమామిడి అంజయ్య, గాలి రామచంద్రయ్య ఉన్నారు.



మొయినాబాద్‌రూరల్: పల్లవి పాఠశాలలో యోగాసనాలు చేయిస్తున్న ప్రియాంక



షాద్‌నగర్‌రూరల్: ఇండియన్ హైట్ స్కూల్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



షాబాద్: కుర్వగూడలో యోగా నిర్వహిస్తున్న నాయకులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

9వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గంలోని అయా గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు. యోగా సర్వరోగ నివారిణి. రోజు రోజుకూ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని యోగా నిపుణులు సూచిస్తున్నారు. తమ తమ పనుల్లో తీరిక లేకుండా గడపడం వల్ల మన శరీరం అలసటకు గురై వ్యాధుల బారిన పడే అవకాశాల ఉన్నాయని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. –సాక్షి, నెట్‌వర్క్



షాద్‌నగర్ : రాగూర్ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు